


కల్యాణ మహోత్సవం

గుంటూరురూరల్: గోరంట్లలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉత్తర నక్షత్రం సందర్భంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకారం చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 513.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహరి (మంగళ)
నరసరావుపేట	6.27	4.54
గుంటూరు	6.25	4.52
బాపట్ల	6.25	4.52

న్యూస్‌రీల్

అధ్యాపకులను రిలీవ్ చేసి పంపాలి

ఆర్ఐఓ జుబేర్

గుంటూరుఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్పాట్ వాల్యూయేషన్ కేంద్రంలో కెమిస్ట్రీ, హిస్టరీ సబ్జెక్టుల మూల్యాంకనాన్ని సోమవారం ప్రారంభిస్తున్నట్లు ఆర్ఐవో జీకే జుబేర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం కెమిస్ట్రీ, హిస్టరీ సబ్జెక్టులకు ఈనెల 26న ప్రారంభం కావాల్సి ఉన్న మూల్యాంకనాన్ని ఒక రోజు ముందుగా ఈనెల 25వ తేదీకి మార్పు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలు తప్పనిసరిగా ఆయా సబ్జెక్టులకు సంబంధించిన అధ్యాపకులను విధుల నుంచి రిలీవ్ చేసి, సోమవారం ఉదయం 10 గంటలకు గుంటూరు సాంబశివపేటలోని స్పాట్ వాల్యూయేషన్ కేంద్రానికి పంపాలని ఆదేశించారు. గైర్హాజరైన అధ్యాపకులకు రోజుకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

ఎన్నికల నిర్వహణలో శాఖల బాధ్యత కీలకం

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి



గుంటూరు వెస్ట్: సాధారణ ఎన్నికలకు సంబంధించి స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన లీగల్ సెల్, ఎంసీఎంసీ సెల్, ఎలక్షన్ కోఆర్డినేషన్ సెల్, సువిధ విభాగాలను ఆదివారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ప్రతి విభాగంలోనూ పనితీరుతోపాటు సిబ్బందికి ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ప్రతి రోజూ సమర్పించాల్సిన నివేదికలను పారదర్శకంగా, పటిష్టంగా తయారుచేసి పంపాలన్నారు. అంతేకాకుండా వచ్చే ఫిర్యాదులను కూడా జాగ్రత్తగా గుర్తించాలన్నారు. కలెక్టర్‌తోపాటు డీఆర్వో పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, నోడల్ అధికారి రఘు పాల్గొన్నారు.

31 వరకు విద్యాహక్కు చట్టం ప్రవేశాలకు గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాహక్కుచట్టం –2009 ద్వారా 2024–25 విద్యా సంవత్సరానికి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లలో ఉచితంగా ప్రవేశం పొందుటకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈనెల 31కి పొడిగించినట్లు డీఈవో పి.శైలజ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న పిల్లలు (అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ) బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల పిల్లలు ఒకటో తరగతిలో ప్రవేశం పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధిక సంఖ్యలో విద్యార్థులకు అవకాశం కల్పించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం దరఖాస్తు గడువును పొడిగించిందని, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థుల నివాసానికి సమీపంలో ఉన్న ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ సిలబస్ అందిస్తున్న అన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం కోటా క్రింద ప్రవేశం పొందవచ్చని వివరించారు. ఆసక్తిగలవారు సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్‌వెబ్‌సైట్‌తో పాటు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయం, ప్రైవేటు నెట్ కేంద్రాలు, ఎంఈవో కార్యాలయం, మీ సేవా కేంద్రాల నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పని వేళల్లో సమగ్ర శిక్ష – పాఠశాల విద్యాశాఖటోల్ ఫ్రీ నంబరు 1800–4258–599లో సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష గాజుల నోము



మోపిదేవి: విజయవాడకు చెందిన ఓలేటి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో లక్ష గాజుల నోము మోపిదేవిలో జరిగింది. మోపిదేవి శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 80 వేల గాజులు మహిళా భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ నోము ద్వారా ముత్తయిదువులను గౌరవించాలనే సంకల్పంతో మహిళలకు కుంకుమ బొట్టు పెట్టి గాజులు అందించినట్లు వివరించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఈ నోము ద్వారా మహిళా భక్తులకు గాజులు అందిస్తున్నట్లు తెలిపారు.

క్షణక్షణం.. క్షుణ్ణంగా..

జిల్లాలో కట్టుదిట్టంగా తనిఖీలు

- ఆధారం చూపకపోతే ... అంతే సంగతి!
- ఎన్నికల వేళ 25 అంతరాష్ట్ర, జిల్లా చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు
- డబ్బు, మద్యం తరలింపునకు అడ్డుకట్ట
- రూ.50 వేలకు మించి తరలిస్తే చిక్కులు
- ఇప్పటికే జిల్లాకు చేరిన కేంద్ర బలగాలు
- అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే తిరిగి పొందే అవకాశం



విజయపురిసౌత్ వద్ద శనివారం మాచర్ల ఆర్ఓ, జేసీ శ్యాంప్రసాద్ సమక్షంలో వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

సత్తెనపల్లి: ఎన్నికల సందడి మొదలైంది. పార్టీలు ప్రచార అస్త్రాలు సంధిస్తున్నాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తుంటాయి. కట్టడి చేసేందుకు ఎన్నికల కమిషన్ కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. ఇప్పటికే కమిషన్ నియమావళి అమలుపై సిబ్బందికి శిక్షణనిచ్చారు. జిల్లాస్థాయి అధికారులు, రిటర్నింగ్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద..

జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. మౌలిక వసతులు కల్పించారు. అందులో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై..

సార్వత్రిక ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో నగదు రవాణాపై అధికారులు నిఘా పెట్టారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు రాజకీయ పార్టీలు డబ్బు, మద్యం, వస్తువులు పంపిణీ చేస్తుంటాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే జిల్లా వ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీకి చెందిన కొందరు నాయకులు తాయిలాలను రహస్య ప్రదేశాల్లో నిల్వ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీస్ అధికారులు బృందాలుగా ఏర్పడి ప్రధాన రహదారులపై వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. తగిన ఆధారాలు లేకుండా పరిమితికి మించి నగదు, బంగారం, వెండి వస్తువులు, చీరలు, ఇతర సామగ్రిని తరలిస్తే జప్తు చేసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

జిల్లా సమాచారం..

1,926	445
మొత్తం పోలింగ్ కేంద్రాలు	సమస్యాత్మక కేంద్రాలు

చెక్ పోస్టుల వద్ద తనిఖీలు..

సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 25 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఎట్టి పరిస్థితుల్లో నగదు, మద్యం సరిహద్దుల నుంచి జిల్లాకు చేరకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీస్ శాఖతో పాటు రెవెన్యూ, ఇతర సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేశారు.

నగదు స్వాధీనం..

జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ఇప్పటి వరకు నిర్వహించిన తనిఖీల్లో రూ.17.90 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. రూ.23.31 లక్షల విలువైన మద్యం, రూ.52.65 లక్షల విలువైన ఇతర సామగ్రి సీజ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ప్రకటించారు.

జిల్లాకు చేరిన కేంద్ర బలగాలు...

శాంతిభద్రతల పరిరక్షణకు ఇప్పటికే కేంద్ర బలగాలు జిల్లాకు చేరాయి. జిల్లా వ్యాప్తంగా ప్రధాన కేంద్రాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తూ ఓటర్లకు భరోసా కల్పిస్తున్నారు. నేరచరితులను బైండోవర్ చేస్తున్నారు. లైసెన్స్ ఆయుధాలు డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. కార్డెన్ సెర్చ్, ఆపరేషన్లు, పికెట్ ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా స్పెషల్ బ్రాంచి, లా అండ్ ఆర్డర్, సెబ్ ఏఆర్, సైబర్, ఐటీ కోర్, తదితర విభాగాల అధికారుల సమన్వయంతో పక్కాగా విధులు నిర్వహిస్తున్నారు.

నిబంధనలు ఇలా...

- ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు రూ.50 వేలకు మించి నగదు, రూ.10 వేల విలువ కన్నా ఎక్కువ సామగ్రి రవాణా చేయడం నిషిద్ధం. ప్రచార కార్యక్రమాల సమయంలో కూడా రూ.లక్షకు మించి నగదు ఉండకూడదు.
- భూములు, స్థిరాస్తులు కొనుగోలుకు నగదు తీసుకెళ్తుంటే లావాదేవీల దస్తావేజులు, మీ–సేవ కేంద్రంలో నమోదు చేసుకున్న స్లాట్ వివరాలు ఉండాలి.
- వివాహాలు, ఇతర శుభకార్యాల కోసం బంగారు ఆభరణాలు కొనుగోలు చేసి తరలిస్తుంటే తగిన రసీదులు ఉండాలి.
- సాధారణ పౌరులు రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే ... బ్యాంకు రసీదు, సెల్‌ఫోన్‌కి వచ్చిన సంక్షిప్త సందేశం ఉండాలి. డబ్బు ఎందుకోసం తీసుకెళ్తున్నారో సరైన వివరణ ఉండాలి. అవసరమైతే ఇన్వాయిస్ పత్రం చూపాలి.
- ఉద్యోగులు, కార్మికులు, కూలీలకు సంబంధించిన వేతనాలు చెల్లించేందుకు తీసుకెళ్లే నగదుకు సంబంధించి వారి జాబితా, నగదు డ్రా చేసిన రసీదు ఉండాలి.
- వైద్యం నిమిత్తం చెల్లించేందుకు నగదు తీసుకువెళ్లుతున్నట్లైతే సంబంధిత రోగి, ఆస్పత్రి వివరాలకు సంబంధించిన పత్రాలు ఉండాలి.
- రైతులు, సాధారణ పౌరులు వ్యవసాయానికి, ఇంటి అవసరాలు, పరికరాల కొనుగోలు కోసం నగదు తీసుకువెళ్తే ఇన్వాయిస్, కొటేషన్లు వెంట పెట్టుకోవడం మంచిది.

చెక్‌పోస్టులు ఇలా..

ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు	3
సరిహద్దు చెక్‌పోస్టులు	6
ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులు	16
మొత్తం చెక్ పోస్టులు	25

ఇలా తిరిగి పొందొచ్చు..

అధికారులు జప్తు చేసిన నగదును పౌరులు తిరిగి పొందాలంటే కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన త్రీమెన్ జిల్లా పర్యవేక్షణ కమిటీకి సంబంధిత ధ్రువపత్రాలు, బ్యాంకు ఓచర్లు, రసీదులు అందజేయాల్సి ఉంటుంది. ఈ కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి అప్రూవల్ చేస్తే కలెక్టర్ అనుమతి ఇస్తారు. త్రీమెన్ కమిటీలో డిస్ట్రిక్ట్ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్, ఎస్‌డీసీఎల్, కేఆర్ఆర్‌సీ సభ్యులుగా ఉన్నారు.

టీబీ సకాలంలో గుర్తిస్తే నివారణ సాధ్యం

డీఎంహెచ్ఓ డాక్టర్ రవి



అవగాహన బ్యానర్ ప్రదర్శిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రవి, డాక్టర్ మురళీకృష్ణ

నరసరావుపేట: క్షయను సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే నియంత్రణ సులభమని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి పేర్కొన్నారు. ప్రపంచ క్షయ నియంత్రణ దినోత్సవం సందర్భంగా 'అవును మేము టీబీని అంతం చేయవచ్చు' అనే నినాదంతో ఏర్పాటు చేసిన ర్యాలీని ఆదివారం ప్రారంభించారు. డాక్టర్ రవి మాట్లాడుతూ క్షయ అంటు వ్యాధి, ప్రధానంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుందని, సరైన సమయంలో సరైన చికిత్స చేయించుకోకపోతే ప్రాణాలకే ప్రమాదకరమని హెచ్చరించారు. వ్యాధి సోకిన వ్యక్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, ఉమ్మినప్పుడు బ్యాక్టీరియా గాలి ద్వారా ఇతరులకు వ్యాపిస్తుందన్నారు. ఈ వ్యాధి సోకిన వ్యక్తులు ఆరు నుంచి 12 నెలల వరకు యాంటీ బ్యాక్టీరియల్ మందులతో కలిపి తీసుకున్నట్లయితే వ్యాధిని నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ వ్యాధికి చికిత్స పూర్తిగా ఉచితమని అన్నారు. సరైన చికిత్స చేయకపోతే టీబీ ప్రాణాంతకం కావచ్చునని హెచ్చరించారు. జిల్లా లెప్రసీ, క్షయ వ్యాధి నియంత్రణ అధికారి, డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 1542 టీబీ కేసులు నమోదయ్యాయని, వీటన్నిటికీ కూడా క్రమం తప్పకుండా వైద్యం, పౌష్టికాహారం అందజేస్తున్నామని అన్నారు. మూడు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే క్షయవ్యాధి కావచ్చునని, అప్రమత్తంగా ఉండి దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సంప్రదించాలని కోరారు. ర్యాలీలో డాక్టర్ హనుమకుమార్ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

- వైభవంగా శ్రీవారి కల్యాణమహోత్సవం
- కనుల పండువలా తిలకించి భక్తి పారవశ్యంలో మునిగిన భక్తజనం



అశ్వవాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు

మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన యుగయుగాల దేవుడు రాత్రి స్వామి వారి ఎదుర్కోల ఉత్సవం జరుపుకుని అర్ధరాత్రి 12 గంటలకు కల్యాణ వేదికపైకి వేంచేసి భక్తులకు దర్శనమిచ్చారు. అప్పటికే వేలాదిగా కల్యాణ వేదిక వద్దకు చేరుకున్న భక్తులు స్వామిని తిలకించి పులకించిపోయారు. అర్ధరాత్రి 12 గంటలకు ప్రారంభమైన కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సోమవారం తెల్లవారుజాము వరకు నిర్వహించిన కల్యాణమహోత్సవాన్ని తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఉత్సవానికి శాశ్వత కైంకర్యపరులుగా దుగ్గిరాల మండలం తుమ్మపూడికి చెందిన వాసిరెడ్డి కోటయ్య కుమారుడు నాగేంద్రప్రసాద్ వ్యవహరించగా పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం తరుపు అవ్వార్ వాచ్ కంపెనీ తరపున శరత్‌బాబు అందజేసిన మధుపర్కములు, మంగళ ద్రవ్యములను ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి సంఘం సభ్యులు స్వామి వారికి అందజేశారు. కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు దీవి అనంత పద్మనాభచార్యులు, మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు నిర్వహించగా కల్యాణం వ్యాఖ్యతగా దీవి నరసింహదీక్షితులు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు భక్తులను అలరించాయి. నార్త్ జోన్ డీఎస్పీ రవికాంత్ ఆధ్వర్యంలో పటిష్టబందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు మంగళాద్రి తిరునాళ్ల..

శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి దివ్యరథోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. మంగళాద్రి తిరునాళ్లగా ప్రసిద్ధికెక్కిన రథోత్సవానికి లక్షకుపైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. రథోత్సవానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం బంగారు గరుడోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం అన్న సమారాధన అనంతరం మూడు గంటలకు స్వామి వారి దివ్యరథోత్సవం ప్రారంభించనున్నారు.

మెడికల్ కాలేజీ పల్నాడుకు సంజీవిని

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- ఐఎంఏ బృందం సందర్శన



మెడికల్ కాలేజ్‌ని సందర్శించిన ఐఎంఏ బృందంతో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల రూరల్: పల్నాడుకు సంజీవిని వైఎస్సార్ మెడికల్ కళాశాల అని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. పిడుగురాళ్ల మండలంలోని కామేపల్లి రెవెన్యూ పరిధిలోని బ్రహ్మణపల్లిలో నిర్మిస్తున్న డాక్టర్ వైఎస్సార్ హాస్పిటల్, మెడికల్ కాలేజీని ఇండియన్ మెడికల్ అసోషియేషన్ పల్నాడు బృందంతో కలసి ఆదివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ 30 పడకలు కూడా లేని వెనుకబడిన పల్నాడు ప్రాంతానికి రూ.500 కోట్లతో 600 పడకల హాస్పిటల్, మెడికల్ కాలేజీని నిర్మించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో సాధ్యమైందని పేర్కొన్నారు. ఉభయ గుంటూరు జిల్లాలో స్వాతంత్ర్యం రాక ముందు ఒకే ఒక మెడికల్ కాలేజీ గుంటూరులో ఉందని, ఇప్పటి వరకు ఎక్కడా నిర్మించలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండోది పల్నాడులోని కామేపల్లి ప్రాంతానికి తీసుకొచ్చినట్లు వివరించారు. మెరుగైన వైద్య విద్యనభ్యసించాలన్న విద్యార్థులకు ఇక్కడ చక్కని అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో పల్నాడు ప్రాంతం నుంచి వైద్య విద్యనభ్యసించేందుకు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, నేడు అందుబాటులోనే వైద్య విద్యకు అవకాశం కలిగిందని వివరించారు. ఈప్రాంతానికి అనేక మంది డాక్టర్లు సామన్య వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారేరని, వైద్య వృత్తిలో రాణిస్తూ మంచి పేరు ప్రఖ్యాతలు కలిగి ఉన్నారని గుర్తు చేశారు. అందులో భాగంగానే నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల ప్రాంతాలకు చెందిన వైద్య నిపుణుల అనుభవాలు, సలహాలు, అభిప్రాయాలను తెలియజేసేందుకు మెడికల్ కాలేజీని సందర్శించడం జరిగిందన్నారు. వారి సూచలను, సలహాలు తప్పక పాటిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యులు గజ్జల బ్రహ్మారెడ్డి, శరత్‌చంద్ర, శివరామిరెడ్డి, అశోక్‌బాబు, వివేకానందరెడ్డి, పి.వెంగళరెడ్డి, ఫణీంద్రరెడ్డి, వెంగళరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాజనారాయణరెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా



డాక్టర్ వైఎస్సార్ మెడికల్ కాలేజీ నిర్మాణం కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఉంది. ఇక్కడ అత్యాధునికమైన ఆపరేషన్ థియేటర్లు, సెంట్రల్ ఏసీ సిస్టమ్‌తో సదుపాయాలు, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇది చాలా గర్వించదగిన విషయం.

– లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అంజిరెడ్డి హాస్పిటల్ అధినేత, పిడుగురాళ్ల

అంతర్జాతీయ ప్రమాణాలతో ఆస్పత్రి నిర్మాణం



డాక్టర్ వైఎస్సార్ మెడికల్ కాలేజీ ఎంతో అధునాతనమైన అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం చేపట్టారు. వైద్య రంగంలో మెరుగైన ఉత్తమ వైద్య సేవలు అందించేందుకు హాస్పిటల్, కాలేజ్ ఉపయోగపడుతుంది. మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పల్నాడు ప్రజలు ఎంతో రుణపడి ఉంటారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషి అభినందనీయం.

– డాక్టర్ రామలింగారెడ్డి, వైద్య నిపుణులు, నరసరావుపేట

రికార్డు స్థాయిలో 'టికెట్' ఆదాయం



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ దర్శన టికెట్ల విక్రయాలతో ఆదివారం రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. ఆదివారం ఒక్క రోజే సుమారు రూ. 22 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అంతరాలయ దర్శన టికెట్ల ద్వారా రూ.11 లక్షలు, ముఖ మండప దర్శన టికెట్ల ద్వారా రూ. 5 లక్షలు, రూ. వంద టికెట్ల విక్రయం ద్వారా రూ. 6 లక్షల ఆదాయం సమకూరింది. గత నాలుగు రోజులుగా స్కానింగ్ పాయింట్‌లో ఆలయ ఈవో తనిఖీలు నిర్వహించడం, అనధికార వీఐపీలకు బ్రేక్ వేయడంతోనే రికార్డు స్థాయి ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు చెబుతున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో ఎన్.రమేష్ బాబులు పలు మార్లు క్యూలైన్లను పర్యవేక్షించారు.

కిటకిటలాడిన క్యూలైన్లు..

అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. ఉదయం 9 గంటలకే ఘాట్‌రోడ్డుపై ద్విచక్ర వాహనాలతో నిండిపోవడంతో కొండపైకి ఎటువంటి వాహనాలను అనుమతించలేదు. దీంతో భక్తులు తమ కార్లు, ఇతర రవాణా వాహనాలను హెడ్ వాటర్ వర్క్స్, సీతమ్మ వారి పాదాలు, వీఎంసీ కార్యాలయ పరిసరాల్లో నిలుపుకుని దేవస్థాన బస్సులలో కొండపైకి చేరుకున్నారు. ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు ఆయా క్యూలైన్ మార్గాలలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఎండ తీవ్రత అధికంగా దేవస్థాన ఆవరణలో ఆదివారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు.

సునాదం.. జయగీతం

క్రైస్తవుల జయోత్సాహ నినాదాలతో వీధులు మార్మోగాయి. హోసన్నా జయం.. రాజుల రాజుకే జయం.. క్రీస్తు రాజుకే జయం అంటూ ఈత మట్టలతో ర్యాలీలు నిర్వహించారు. ఏసుక్రీస్తు తాను సిలువపై ప్రాణార్పణ చేయడానికి ముందు ఇశ్రాయేలు దేశంలోని జెరూషలేంలో ప్రవేశించిన రోజును స్మరిస్తూ క్రైస్తవులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. చర్చిల్లో ప్రార్థనలు చేశారు. అనంతరం పిల్లలు, పెద్దలు వీధుల్లో ఈత మట్టలు, ప్ల కార్డులు చేత పట్టుకొని ర్యాలీ నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



రొంపిచర్లలో మట్టలు చేతబూని ప్రదర్శన నిర్వహిస్తున్న భక్తులు



రెంటచింతలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న విచారణ గురువులు రెవ. ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి



ఫిరంగిపురంలో వాక్యోపదేశం చేస్తున్న మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య

క్లుప్తంగా

క్రీస్తు స్మరణతో అతీతమైన ఆనందం

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ భక్తితో కూడిన శాంతియుత మార్గం అనుసరించాలని గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో మట్టల ఆదివారం(మ్రానికొమ్మల) పండగను వైభవంగా నిర్వహించారు. భాగ్యయ్య వాక్యోపదేశం చేస్తూ ప్రతి ఒక్కరూ దైవ చింతనతో జీవించాలని అన్నారు. దీక్షలో ఉన్న భక్తులు ఇతరులతో ప్రేమ, సోదర భావంతో మెలగాలని చెప్పారు. క్రీస్తు స్మరణం ద్వారా అతీతమైన ఆనందం కలుగుతుందని దాని ద్వారా ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవనం కొనసాగిస్తారన్నారు. అనంతరం దివ్య పూజాబలి కార్యక్రమం నిర్వహించారు. మ్రాని కొమ్మలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా బిషప్ బంగ్లా వద్ద నుండి మేత్రాసన గురువులను భక్తులు, కథోలిక క్రైస్తవులు సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బాల ఏసుదేవాలయ విచారణ గురువులు పామిశెట్టి బాలస్వామి, సహాయ విచారణ గురువులు ఆర్.అనిల్ కుమార్, ఫాదర్ విలియమ్స్, మఠకన్యాస్త్రీలు, గుడి పెద్దలు, కథోలిక క్రైస్తవులు పాల్గొన్నారు.

హార్వెస్టర్ తగిలి వృద్ధురాలి మృతి

ఇంకొల్లు (చినగంజాం): అకస్మాత్తుగా హార్వెస్టర్ తగిలి వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన ఇంకొల్లు మండలం భీమవరం గ్రామం పొలాల్లో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం రాయచూరు మండలం గుడిహాల్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మ (64) బతుకుదెరువు కోసం గ్రామానికి వచ్చింది. ఈ నేపథ్యంలో గ్రామ సమీప పొలాల్లో శనగ నూర్పిడి కోసం పనికి వెళ్లింది. పొలంలో పిచ్చి కంపను పీకుతున్న సమయంలో హార్వెస్టర్ తగిలి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు లక్ష్మమ్మ మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. లక్ష్మమ్మ కుమారుడు గురుస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రవి తెలిపారు.

వేణుగోపాలుడి సేవలో న్యాయమూర్తులు

మొవ్వ:మహాకవి క్షేత్రయ్య ఆరాధ్య దైవం అయిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయాన్ని ఆదివారం న్యాయమూర్తులు సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కృష్ణా జిల్లా న్యాయమూర్తి ఎ.అరుణ సారిక, మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ పద్మ, మొవ్వ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పి.రాజన్ ఉదయ్ ప్రకాష్ ఆలయాన్ని దర్శించి క్షేత్రయ్య మహాత్మ్యాన్ని పూజారుల ద్వారా తెలుసుకున్నారు. దేవాలయ అర్చకులు దీవి సీతారామ హనుమాన్, దీవి వంశీ మోహన్‌లు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బలహీనవర్గాల అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిన వారిని సాదరంగా ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి బడుగు, బలహీన వర్గాలకు సామాజికంగా, రాజకీయంగా అత్యున్నత స్థానాన్ని కల్పించి వారి అభివృద్ధికి పాటుపడుతున్నారని పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన 15 కుటుంబాలవారు వైఎస్సార్ సీపీలోకి చేరారు. గౌడ సామాజిక వర్గానికి చెందిన వారికి పీఆర్కే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో బీసీ సామాజిక వర్గం జగన్‌కు అండగా నిలిచి మళ్లీ సీఎంగా బాధ్యతలు చేపట్టేందుకు కృషి చేయాలన్నారు. దేశ చరిత్రలో బీసీలకు కీలక పదవులను కట్టబెట్టి అన్నిరంగాలలో వారికి ప్రాధాన్యతను కల్పించారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకొని పెత్తందారీ వర్గాలు లబ్ధి పొందాయని విమర్శించారు. సర్పంచ్ దేశం శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గొరెడ్డి వెంకటరెడ్డి, పాల్వాయి అంకిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు విశిష్టమైనవి

లఘు ఉద్యోగ భారతి నేషనల్ సంఘటన్ మంత్రి ప్రకాష్ చంద్ర



సమావేశంలో లఘు ఉద్యోగ భారతి దేశ, రాష్ట్ర నాయకులు

నగరంపాలెం: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు విశిష్టమైనవని లఘు ఉద్యోగ భారతి నేషనల్ సంఘటన్ మంత్రి ప్రకాష్‌చంద్ర అన్నారు. అరండల్ పేటలోని యోగి భవన్‌లో ఆదివారం లఘు ఉద్యోగ భారతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగం సభ్యుల సమావేశం నిర్వహించారు. తొలుత భరతమాత, విశ్వకర్మ చిత్ర పటాలకు పూజలు చేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసి యోగీష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రకాష్‌చంద్ర మాట్లాడారు. కుటీర, చిన్న తరహా పరిశ్రమల స్థాపన, ఆర్థిక వనరులు, అనుమతులకు ప్రభుత్వ విభాగాల సంప్రదింపులు, ఉత్పత్తుల మార్కెటింగ్ తదితర అంశాలను వివరించారు. లఘు ఉద్యోగ భారతి నేషనల్ ఉపాధ్యక్షుడు హరిహరన్ రామ్మూర్తి మాట్లాడుతూ.. ప్రతి రాష్ట్రంలో సభ్యుల సంఖ్య పెరిగితే.. వ్యవస్థ బలపడుతుందని, తద్వారా తమ వాణిని ప్రభుత్వానికి వినిపించవచ్చన్నారు. త్వరగా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. బ్యాంకు రుణాలు తీసుకున్నప్పుడు ప్రభుత్వం ప్రకటించే సబ్సిడీ, ఇన్సెంటివ్స్, వాయిదాలు చెల్లింపుల లోటు పాట్లను వివరించారు. తులసీ సీడ్స్ అధినేత తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ ఉత్పత్తిదారుడు నిరంతరం పరిశోధనలు చేస్తూ కొత్త వస్తువులకు రూపకల్పన చేయాలని సూచించారు. రాష్ట్ర అధ్యక్షుడు మాదాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రపంచ ఉత్పత్తులలో యాభై శాతం భారతదేశం నుంచి తయారవుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసి యోగీష్ మాట్లాడుతూ.. ఏపీలోని ప్రతి జిల్లాలో అనేక సహజ, మానవ వనరులు ఉన్నాయని, తయారీ విధానం, ఎగుమతి, సర్వీస్‌లకు అనుకూలమని చెప్పారు. వచ్చే ఐదేళ్లల్లో దేశం మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ సమావేశంలో నేషనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు అనంత్ గోటేటి, అన్నే కృష్ణ బాలాజీ, చిన్న తరహా, కుటీర పరిశ్రమల సభ్యులు పాల్గొన్నారు. చిన్న తరహా పరిశ్రమల నిర్వహణలో తలెత్తే సమస్యలు, వాటిని అధిగమించడంపై సభ్యులు చర్చించారు. పాదరక్షల ఉత్పత్తిదారుల సమస్యలపై ప్రకాష్ చంద్రకు ఏపీ షూ మానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చుక్కపల్లి అరుణ్‌కుమార్ వినతి పత్రం అందించారు.

ఉపాధ్యాయినికి షోకాజ్ నోటీసు

ముప్పాళ్ల: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని కలిసి అభినందించిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయినికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. 'టీడీపీ అభ్యర్థికి ప్రభుత్వ ఉపాధ్యాయిని అభినందనలు' అంటూ 'సాక్షి'లో వచ్చిన కథనంపై విద్యాశాఖ అధికారులు స్పందించారు. మండలంలోని గొల్లపాడు ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కె.బాలప్రకాశరాణి నరసరావుపేట అసెంబ్లీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబును తన భర్తతో కలిసి అభినందించిన విషయం తెలిసిందే. పత్రికల్లో వచ్చిన కథనం మేరకు మండల విద్యాశాఖాధికారి సదరు ఉపాధ్యాయినికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఉపాధ్యాయిని కూడా జరిగిన సంఘటనపై అందించిన వివరణను జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపించటం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ ఎంఈఓ తెలిపారు.

లారీ ఢీకొని బాలుడి దుర్మరణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఓ బాలుడు దుర్మరణం చెందాడు. కృష్ణలంక పోలీసుల వివరాల మేరకు... కొతవరపు గోపి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు శివ గుడ్లవల్లేరులో హాస్టల్‌లో ఉంటూ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతుండగా.. చిన్న కుమారుడు బాలనాగకృష్ణ (12) ఆత్మకూరులో 7వ తరగతి చదువుతున్నాడు. పెద్ద కుమారుడు శివ ఇంటికి వెళ్లే క్రమంలో శనివారం రాత్రి నగరంలోని బస్టాండ్‌కు చేరుకున్నాడు. అక్కడ నుంచి శివను ఇంటికి తీసుకెళ్లేందుకు అతని తండ్రి గోపి చిన్న కుమారుడు బాలనాగకృష్ణతో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. మార్గం మధ్యలో వారధి దాటగా.. బస్టాండ్ వైపు వెళ్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో తండ్రికొడుకులిద్దరూ కిందపడిపోయారు. ఇద్దరికి బలమైన గాయాలయ్యాయి. స్థానికులు ఆటో ద్వారా ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, బాల నాగకృష్ణ మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి గోపి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లచ్చన్నగుడిపూడి సర్పంచ్ ఎన్నిక రద్దు

మంగళగిరి మున్సిఫ్ కోర్టు తీర్పు



లచ్చన్నగుడిపూడి గ్రామ సచివాలయం

మంగళగిరి: తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడి పంచాయతీ సర్పంచ్ ఎన్నికను రద్దు చేస్తూ మంగళగిరి మున్సిఫ్ కోర్టు తీర్పు వెలువరించింది. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా గునుగునూరి అలివేలమ్మ, బొర్రా భాగ్యలత పోటీ చేశారు. భాగ్యలతపై అలివేలమ్మ విజయం సాధించారు. అలివేలమ్మ ఎన్నిక సక్రమంగా జరగలేదని.. అధికారులు నిబంధనల ప్రకారం ఎన్నిక నిర్వహించలేదంటూ భాగ్యలత మంగళగిరి కోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు శనివారం ఎన్నికను రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

- వివాహ వేడుకకు డీజే బాక్సులు తెచ్చేందుకు వెళ్తుండగా వాహనం బోల్తా
- ఘటనలో మరో ఇద్దరికి గాయాలు



మృతి చెందిన ఏటీ రాకేష్



నాదెండ్ల వద్ద పంటపొలాల్లో బోల్తాపడిన వాహనం

నాదెండ్ల: స్నేహితులు కలిసి ఆదివారం ఇర్లపాడు గ్రామంలో జరిగే వివాహ వేడుకకు డీజే బాక్సులు తెచ్చేందుకు ఆటోలో సరదాగా బయలుదేరి వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఈ విషాద ఘటన నాదెండ్ల నుంచి ఎండుగుంపాలెం వెళ్లే అరటి తోటల సమీపంలో జరిగింది. ఎస్‌ఐ జె.బలరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు ఇర్లపాడు గ్రామానికి చెందిన ఏటీ రాకేష్(15) తొమ్మిదో తరగతి పూర్తి చేశాడు. పదో తరగతి చదవాల్సి ఉంది. గ్రామంలో ఆదివారం రాత్రి జరగనున్న వేడుకకు డీజే బాక్సులు తెచ్చేందుకు పిల్లిమల్లి కళ్యాణ్‌కుమార్‌కు చెందిన మినీ గూడ్స్ రవాణా వాహనంలో ఏటీ రాకేష్, సిరిబోయిన రాకేష్‌లు బయలుదేరారు. ఇర్లపాడు నుంచి ఎండుగుంపాలెం మీదుగా నాదెండ్ల సమీపానికి చేరుకునేసరికి వాహనం అదుపు తప్పి పంటపొలాల్లో దూసుకెళ్లి బోల్తాపడింది. దీంతో రాకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన సిరిబోయిన రాకేష్, కళ్యాణ్ కుమార్‌ను 108 సాయంతో నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు రాకేష్‌ను చిలకలూరిపేటలో ఓ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ జె.బలరామ్‌రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. రాకేష్ తల్లి కామేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బంగారం చోరీ కేసులో పురోగతి

- నిందితులను గుర్తు పట్టిన బస్సు కండక్టర్
- మహిళలను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. బంగారం రికవరీ!

నరసరావుపేట టౌన్: ఆర్టీసీ బస్సులో బంగారం మాయం కేసులో టూటౌన్ పోలీసులు పురోగతి సాధించారు. కారంపూడి చెందిన బొల్లినేని వెంకటరమణ నరసరావుపేటకు శనివారం ఆర్టీసీ బస్సులో వస్తుండగా ఆమె బ్యాగ్‌లో సుమారు 13 సవర్ల బంగారు నగలు చోరీకి గురైన విషయం విదితమే. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆర్టీసీ కండక్టర్, బాధితురాలు ఇచ్చిన ఆనవాళ్లతో నిందితులు స్టువర్టుపురంకు చెందిన ముగ్గురు మహిళలుగా గుర్తించారు. ముగ్గురు మహిళలపై ఇప్పటికే మూడు జిల్లాల్లోని పలు పోలీస్ స్టేషన్‌లలో చోరీ కేసులు నమోదై ఉన్నట్లు సమాచారం. అనుమానితుల ఫొటోలను కండక్టర్‌కు, బాధితురాలికి చూపించగా నిందితుల్లో ఒకరిని గుర్తు పట్టినట్లు తెలియవచ్చింది. దీంతో ఆదివారం ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకొని బస్సులో చోరీకి గురైన బంగారు ఆభరణాలను వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలియవచ్చింది.

వైఎస్సార్ సీపీలో వంద కుటుంబాల చేరిక

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్సీ మురుగుడు, లావణ్య



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ హనుమంతరావు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి లావణ్య

మంగళగిరి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో పలువురు చేరుతున్నారని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. ఆదివారం తాడేపల్లి ముగ్గు రోడ్డుకు చెందిన 100 కుటుంబాలు.. తాడేపల్లి పట్టణ పార్టీ కన్వీనర్ బుర్రముక్క వేణుగోపాలస్వామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలోని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ హనుమంతరావు మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆకర్షితులై పార్టీలో భారీగా చేరికలు జరుగుతున్నట్లు చెప్పారు. పార్టీలో చేరిన వారిలో వంశీ, ప్రవీణ్, అశోక్, బాలయ్య, కొండయ్య, రవి, కె. కల్యాణ్, బి.రవి, ఆనంద్, డి.వంశీ, మల్లెల ఆనంద్, డి.రాజు, డి.సిద్ధార్థ తదితరులున్నారు. నాయకులు మున్నంగి వివేకానందరెడ్డి, దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, ముదిగొండ ప్రకాష్, ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్, సంకె సునీత, మల్లవరపు సుధారాణి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో మందులు అందించాలి

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి



మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

గుంటూరు మెడికల్: మెడికల్ షాపుల నిర్వాహకులు వైద్యులు సూచించే మందుల్లో నాణ్యమైన వాటిని మాత్రమే అందించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ 2024–27 సంవత్సరాలకు నూతన కమిటీ ఎంపికతో పాటు సర్వసభ్య సమావేశం స్థానిక బ్రాడీపేటలోని గ్రాండ్ నాగార్జున సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బ్రహ్మారెడ్డి పాల్గొని, మాట్లాడారు. మెడికల్ విభాగంలో పోటీ తత్వం పెరిగిపోయిందని, నాణ్యతలో తేడా లేకుండా రోగులకు మందులు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విశిష్ట అతిథి సీమాంధ్ర డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రత్నం మాట్లాడుతూ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వ్యాపారులు దేశ వ్యాప్తంగా సేవలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు వ్యాపార దృక్పథంతోనే తమను చూడటం విచారకరమన్నారు. కార్పొరేట్ వ్యాపారుల పోటీతో హోల్ సేలర్స్, రిటైలర్స్ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మెడికల్ షాపులను సేవ కేంద్రాలుగా భావించి విద్యుత్, వ్యాపార పన్నుల విధానంలో రాయితీలు ఇవ్వాలని కోరారు. కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేపీ రంగారావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్ పవన్ కుమార్, టీవీ సుబ్రహ్మణ్యం, జిల్లా వ్యాప్తంగా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా ఆదినారాయణ

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా 2024 –27 సంవత్సరాలకు గార్లపాటి ఆదినారాయణ, కార్యదర్శిగా కల్యాణం చంద్రశేఖర్‌రావు, కోశాధికారిగా బి .వెంకట ప్రసాద్‌లను, కార్యనిర్వాహక సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రజలంతా జగనన్న వైపే..!

వైఎస్సార్ సీపీ అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి




కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పార్టీలు ఒకవైపు ఉన్నా ప్రజలు మాత్రం జగనన్న వైపే ఉన్నారని.. ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకొని తీరుతామని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ముస్లింల ఆధ్వర్యంలో రూపొందించిన 'మేమంతా జగన్ వెంటే' కరపత్రాలను ఆవిష్కరించారు. చిన హనిమిరెడ్డి మాట్లాడుతూ ముస్లింల అభ్యున్నతి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా ఉండాలని కోరారు. పేదలకు సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాలని సూచించారు. తాను నియోజకవర్గానికి కొత్తగా వచ్చినా అద్దంకి ప్రజలు కుటుంబ సభ్యుడిగా ఆదరిస్తున్నారని తెలిపారు. తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ముస్లిం మైనార్టీ విభాగం కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి, బాపట్ల, ప్రకాశం, పల్నాడు ముస్లిం మైనార్టీ విభాగం రీజనల్ కోఆర్డినేటర్ షేక్ ఇమాం హుస్సేన్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మట్లపూడి బాజీవలి, 17వ వార్డు కౌన్సిలర్ జబ్బార్, 14వ వార్డు ఇన్‌చార్జి షేక్ హుస్సేన్ బాషా, కో ఆప్షన్ సభ్యుడు మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

వైఎస్సార్ సీపీ పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి బాలాజీ



నాయకులను సన్మానిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ

చినగంజాం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమైందని.. అటువంటి సుపరిపాలనను అందించిన ప్రభుత్వాన్ని తిరిగి తెచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. చినగంజాం మండలం కొత్తపాలెం పంచాయతీ నుంచి మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చిన కార్యకర్తలతో మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీకి దక్కుతుందని తెలిపారు. అదే సమయంలో అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసి రెండింటిని సమానంగా అమలు చేశారని చెప్పారు. మళ్లీ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ సుపరిపాలనను తిరిగి తెచ్చుకునేందుకు కార్యకర్తలందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పర్చూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కార్యకర్తలు ఆయన్ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాటుకూరి బాబురావు, అంకిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

విస్తృత తనిఖీలు







ఎన్నికల షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో పోలీసులు నిఘా పెంచారు. ఆదివారం రాత్రి గుంటూరు నగరంలోని మదర్ థెరిస్సా బొమ్మ సెంటర్‌లో వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు.

–సాక్షి, ఫొటోగ్రాఫర్, గుంటూరు.